అక్షర దర్బార్ voice of the people తెలుగు దినపత్రిక

కాంగ్రెస్ పరిశీలనలో శోభన్ కుమార్!

శోభన్ కుమార్ కు టికెట్ ఇస్తే ఎలా ఉంటుంది..?

కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి జిల్లాలో పది అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించి తిరుగులేని పార్టీగా అవతరించింది. పార్లమెంట్ ఎన్నికల్లోనూ ఇదే ఒరవడి కొనసాగించాలని కాంగ్రెస్ పెద్దలు పక్కా ప్రణాళికతో ముందుకు సాగుతున్నారు. ఇందుకోసం ఎవరినీ బరిలో దింపితే బాగుంటుందని తీవ్ర కసరత్తు చేస్తున్నది. కొందరి పేర్లు పరిశీలనలో ఉన్నా.. అందులో అడిషనల్ డీసీపీగా పనిచేస్తున్న పుల్లా శోభన్ కుమార్ కు సర్వేలో అన్ని అంశాల్లో పాజిటివ్ గా రావడంతో అధిష్ఠానం ఆయన పేరును పరిశీలనలోకి తీసుకున్నట్లు సమాచారం. ఆయనకు ఉమ్మడి వరంగల్ జిల్లాలో అన్నివర్గాల తోనూ విస్తృతమైన ప్రజాసంబంధాలు ఉండటంతో అధిష్ఠానం సీరియస్ గా పరిశీలిస్తున్నట్లు కాంగ్రెస్ శ్రేణుల్లో చర్చ జరుగుతున్నది. ఎలాంటి రాజకీయ నేపథ్యం లేకపోయినా .. ప్రజలతో సత్సంబంధాలు ఉండటం.. కొత్త వ్యక్తిని ప్రజలకు పరిచయం చేసినట్లు ఉంటుందని, ఇది కాంగ్రెస్ పార్టీ గెలుపునకు కలిసి వస్తుందని అధిష్ఠానం భావిస్తుంది. వరంగల్ పార్లమెంట్ స్థానంలో ప్రయోగాత్మకంగా ఆయనను బరిలో నిలిపేందుకు వ్యూహాత్మకంగా ముందుకు సాగుతున్నట్లు తెలుస్తోంది.

సర్వేలో పాజిటివ్ గా రావడంతో అధిష్ఠానం దృష్టి..

పేదకుటుంబం నుంచి అంచెలంచెలుగా ఎదిగి..

హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామానికి చెందిన పుల్లా శోభన్కుమార్ పేద కుటుంబం నుంచి అంచెలంచెలుగా ఎదిగారు. ప్రాథమిక విద్యాభ్యాసం గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలోనే పూర్తి చేశారు. హుజురాబాద్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదివారు. ఆ తర్వాత వరంగల్ ఎల్బీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశారు. ఎలాగైనా జీవితంలో గొప్ప స్థానంలో నిలువాలని పట్టుదలతో ఎస్సైగా ఉద్యోగం సాధించారు. మొదటి పోస్టింగ్ ఉమ్మడి వరంగల్ జిల్లా ఖానాపురం పీఎస్. ఆ తర్వాత హసన్పర్తి, కాజీపేట, పరకాలలో ఎస్సైగా పనిచేశారు. అనంతరం సీఐగా పదోన్నతి పొంది భూపాలపల్లి, హసన్పర్తి, హన్మకొండ, మిల్స్కాలనీ, మామునూరులో పనిచేశారు. అనంతరం డీఎస్పీగా పదోన్నతి పొంది మహబూబాబాద్, హన్మకొండ, మామునూరులో విధులు నిర్వర్తించారు. అక్కడి నుంచి కరీంనగర్ టాస్క్ఫోర్స్ డీఎస్పీగానూ ఆయన విధులు నిర్వర్తించారు. అడిషనల్ ఎస్పీగా పదోన్నతి పొంది భూపాలపల్లి, ములుగు జిల్లాలకు ఓఎస్డీగా పనిచేశారు. అనంతరం విజిలెన్స్ అండ్ ఎన్ఫోర్స్మెంట్లో ఐదు నెలలు పనిచేశారు. ప్రస్తుతం ఏడాదికాలంగా సైబరాబాద్ కమిషరేట్లో ఎస్వోటీ అడిషనల్ డీసీపీగా పుల్లా శోభన్కుమార్ విధులు నిర్వర్తిస్తున్నారు. 33ఏళ్లుగా పోలీస్ వ్యవస్థలో వివిధ హోదాల్లో పనిచేశారు. ఆయన సర్వీస్ లో ఎన్నో అవార్డులు అందుకున్నారు. తాను ఎక్కడ పనిచేసిన ఇటు ప్రజలు, అటు సిబ్బందితో మమేకమవుతారు. ఆపద ఉన్న వారిని అక్కున చేర్చుకుంటారు. అందుకే శోభన్ కుమార్ రాజకీయాల్లోకి వస్తున్నారని వార్తలు వస్తుండటంతో ఉమ్మడి జిల్లా ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. శోభన్ కుమార్ గెలిపించుకుని తీరుతామని కొన్ని గ్రామాల్లో ప్రజలు చెపుతున్నారు

- ఉమ్మడి జిల్లా ప్రజలకు సుపరిచితుడు..
- పనిలో నిబద్ధత, నిజాయితీకి మారుపేరు పుల్లా
- ప్రజలతో సత్సంబంధాలు..
- పోలీసు శాఖలో ఎన్నో అవార్డులు..
- వరంగల్ పార్లమెంట్ టిక్కెట్ శోభన్ కు ఇస్తే ఎలా ఉంటుంది..?
- పుల్లా అభ్యర్థిత్వాన్ని సీరియస్ గా పరిశీలిస్తున్న పార్టీ పెద్దలు..
- హస్తం పార్టీలో జోరుగా చర్చ..
- పార్టీ అవకాశం ఇస్తే పోటీ చేస్తా.. : పుల్లా శోభన్ కుమార్

కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇస్తే పోటీ చేస్తా..

పుల్లా శోభన్ కుమార్

కాంగ్రెస్ పార్టీ అవకాశం ఇస్తే వరంగల్ పార్లమెంట్ స్థానం నుంచి తప్పనిసరి బరిలో దిగుతానని అడిషనల్ డీసీపీ పుల్లా శోభన్ కుమార్ పేర్కొన్నారు. పోలీసుగా ప్రజలకు సేవ చేసినప్పటికీ.. ప్రజాప్రతినిధిగా మరింత మంది పేదలకు సేవ చేసే అవకాశం ఉంటుందని, అందుకే, రాజకీయాల్లోకి రావాలనుకుంటున్నానని ఆయన తెలిపారు.

వివాదరహితుడు.. యువతకు మార్గదర్శకుడు..

పుల్లా శోభన్కుమార్కు వివాదరహితుడిగా పేరుంది. యువతకు భవిష్యత్ పై భరోసా కల్పించడంతోపాటు వారి ఉపాధికి బాటలు వేశారు. కానిస్టేబుల్, ఎస్సై నియామకాల సమయంలో ఎంతో మందికి యువతకు మెలకువలు నేర్పించి యువతకు మార్గదర్శిగా నిలిచారు. పోలీసు ఉద్యోగాలకు ఎలా ప్రిపేర్ కావాలనే అంశాలపై యువతకు అవగాహన కల్పించారు. అంతేకాదు, క్రీడాకారులను సైతం ప్రోత్సహించారు. వారికి ఆర్థికంగా చేయూతనందించారు. వరంగల్ పార్లమెంట్ పరిధిలోని వరంగల్ పశ్చిమ, వరంగల్ తూర్పు, వర్ధన్నపేట స్టేషన్ఘన్పూర్, పరకాల, భూపాలపల్లి, పాలకుర్తి నియోజకవర్గాలతో విస్తృతమైన ప్రజా సంబంధాలు ఉన్నాయి. తన మూడు దశాబ్దాల సర్వీసులో వివాదాలకు దూరంగా ఉంటూ విస్తృతంగా పర్యటించారు. విద్యార్థులు, యువకులు, ఉద్యోగులు, కుల, ప్రజాసంఘాలు, రాజకీయ నాయకులతో సత్సంబంధాలు ఉన్నాయి. ఓ వైపు సమర్థవంతంగా విధులు నిర్వర్తిస్తూనే.. మరోవైపు సామాజిక బాధ్యతగా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ప్రధానంగా యువతను సన్మార్గంలో నడిపించేందుకు, విద్య, ఉపాధి, ఉద్యోగాల్లో స్థిరపడేందుకు తనవంతు కృషి చేస్తున్నారు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని కాంగ్రెస్ పార్టీ పెద్దలు శోభన్కుమార్ పేరును సీరియస్గా పరిశీలిస్తున్నట్లు తెలుస్తోంది. అంతేకాదు, కాంగ్రెస్ పార్టీలో కీలక నాయకులు కూడా ఆయన అభ్యర్థిత్వానికి మద్దతు తెలుపుతున్నారు.